

"ఏమండీ రావుగారూ! అంతా సిద్ధమేనా? ఆ పూలదండలు ఎక్కడ పెట్టారు?" హడావుడిగా వస్తూ అడిగారు సత్యంగారు.

"ఆఁ...ఆఁ.. అంతా సిద్ధమే! ఆ పెద్ద పూలదండ వేరేగా పెట్టాను. చూశారూ అది మన ముఖ్యమంత్రిగారికని ప్రత్యేకంగా చేయించాను.ఇక పోతే కూల్‌డ్రింక్సకని మన కుమార్‌గారికి చెప్పాను. అవి కూడా వచ్చేస్తాయి. డిన్నర్ ఏర్పాట్లూ అవీ విశ్వంగారు చూస్తున్నారు." మరింత హడావుడిగా చెప్పారు రావుగారు.

వాళ్ళిద్దరూ కమిటీ పెద్దలు. ఈ రోజు రవీంద్ర భారతిలో అత్యంత వైభవంగా జరగబోతున్న సన్మానానికి సన్నాహాలు చేస్తున్నారు.

అవును! సన్మానం! ఎవరికో కాదు—నాకే! ఆ మాట తలచుకున్నప్పుడల్లా ఉక్కిరి బిక్కిరి అవుతున్నంత ఆనందం. నాలాటివాడికి రవీంద్ర భారతిలో, అందునా ముఖ్యమంత్రిగారిచేత సన్మానం!

నా జీవితంలో మరిచిపోలేని మధురమైన రోజు. నా జీవితానికో సార్థకతా, నా సంగీత ప్రావీణ్యానికో గుర్తింపూ, నా పేదరికానికి విముక్తి లభిస్తున్న అత్యంత విలువైన రోజు.

పుట్టు గుడ్డివాడినైన నేను ఈ విశాల ప్రపంచాన్ని చూడలేక పోయినా, చిన్నప్పటినుంచీ అభ్యసిస్తున్న వయొలిన్ వాద్యంతో సంగీత ప్రపంచంలో విహరించాను.

ఏ పూర్వజన్మ పాప ఫలమో తెలియదుగానీ గుడ్డివాడుగా పుట్టిన నేను పదో ఏటనే తల్లినీ, తండ్రినీ పోగొట్టుకున్నాను. ఓ మహానుభావుడి సహాయంతో వయొలిన్ వాద్యాన్ని నేర్చుకున్నాను. సరస్వతీ కటాక్షం వల్ల సంగీతాన్ని నేర్చుకోగలిగాను. కాని, లక్ష్మీకటాక్షం లేక నిత్యం పేదరికాన్ని అనుభవిస్తూనే ఉన్నాను.

నేనేగాని కళ్ళుండి చూడగలిగి ఉంటే ఏ కూలీ నాలీ అయినా చేసుకుని బ్రతకగలిగి ఉండేవాడిని. అవి లేకనే ఇంత దీనాతిదీనమైన ప్రాధేయపు బ్రతుకు బ్రతుకుతున్నాను.

అప్పుడప్పుడూ చిన్న చిన్న కచేరీలలో పక్కవాద్యంగా పనిచేశాను. అప్పుడు వాళ్ళిచ్చిన డబ్బుతో కొంతకాలం వెళ్ళేది. తరువాత మళ్ళీ మామూ లే!

# సన్మానం

వేదుల రమణామూ



అలా ఒకసారి కచేరీ చేస్తుండగా సత్యంగారితో పరిచయం జరిగింది. అతను నన్ను పైకి తీసుకువస్తానని, మంచి విద్వాంసులతో సమానమైన గుర్తింపు కల్పిస్తానని మాట ఇచ్చారు. ఆనాటి మాటల ఫలితమే ఈ నాటి ఈ సన్మానం!

ఉదయం ఎప్పుడో సత్యంగారింట్లో తిన్న కొంత టిఫిన్ తప్ప నిన్నటినుంచి ఏమీ లేదు. చాలా ఆకలిగా ఉంది. ఆకలిని ఓర్చుకో గలిగినా ఈ రోజు జరగబోయే కచేరీని రక్తి కట్టించి, నా గురించి ఎంతో కష్టపడుతున్న సత్యంగారికీ, అతని సంఘానికీ పేరు తెప్పించాలంటే నాకు శక్తి కావాలి. కనీసం అందుకైనా నేను ఏదైనా తినాలి.

ఎవరినైనా ఏమైనా అడుగుదామంటే అందరూ చాలా బిజీగా ఉన్నారు.

"చూడండి రావుగారూ! మీరన్నీ చెప్పింది సరాసరి ఆరున్నరకల్లా కచేరీ ప్రారంభం కావాలి! ఎనిమిదిన్నర వరకు కచేరీ అవుతుంది. ఆ తరువాత సన్మాన కార్యక్రమం జరుగుతుంది" అంటూ రావుగారికి ఎలా ఎలా చేయాలో వివరిస్తున్నారు సత్యంగారు.

నాకు చాలా దగ్గరగా వచ్చినట్టున్నారు. మాటలు అందుకే బిగ్గరగా వినిపిస్తున్నాయి. వారితో చెప్పి ఏదైనా తినడానికి అడిగితే బాగుండుననుకున్నాను.

"సత్యంగారూ! మీరు శ్రమ అనుకోకపోతే ఎవరి ద్వారానైనా నాకు కొంత టిఫిన్ తెప్పించండి. నేను ఉదయం నుంచి ఏమీ తినలేదు. చాలా ఆకలిగా ఉంది." ఆకలికి ఓర్చుకోలేక సిగ్గుపడుతూ



